# తుఫాను

శ్రీ కె. వి. సుబ్బారావు

రెండురోజులనుండీ సంతతధారగా కురుస్తోంది వర్షం. గాలి మహాతీవ్రంగా వీస్తోంది. అంతా మహా ప్రళయం వచ్చినట్టుగా వుంది. రోడ్లూ కాలువలూ అన్నీ యేకమయిపోయాయి. గ్రామంలో ఒక్క మనిషికూడా బయట కనిపించడంలేదు. మనుష్యులంతా తలుపులుబిగించుకుని యిళ్ళల్లో కూచున్నారు. గాలికి ఒక్కొక్క చెట్టే ఫెళఫెళా విరిగిపోతోంది. పశువులన్నీ నిరాధారాలయిపోతున్నాయి.

అందరిలాగానే నారిగాడు ఆవేళకూడా కూలికిపోకుండా ఉన్న తన చుట్టుగుడిసెలోనే కూచున్నాడు, గుమ్మానికి ఓతడిక అడ్డంపెట్టి. గుడిసె అంతా నీటిమయం. రెండురోజులబట్టీ లచ్చి లంఖణాలు. గుడిసెలో ఓ దరిగా కుక్కిమలకమంచం మీద పడుకునుంది. ప్రక్కలో చంటిపిల్ల పాలులేక 'కేరు' మంటోంది, అదేపనిగా నారిగాడు పాపాయిని యెత్తుకుని సముదాయిస్తూనే, లచ్చిదగ్గఱగా కూచుని వొళ్లు నిమురుతున్నాడు. పిల్ల యేడుపూ, భార్య రోగం, తన బీదతనం కళ్లముందు నాట్యం చేస్తున్నాయి. తనకు పిచ్చెత్తిపోతోంది. ప్రపంచంఅంతా అయోమయంగా కనిపిస్తోంది. 'లచ్చిని బతికించడం యెల్లా' యిదే అతని జీవితసమస్య అయింది. దేముణ్ణి తలుచుకు వేలాది దణ్ణాలు పెడుతున్నాడు. తన అయిదేళ్ళకొడుకు రామిగాడు అమ్మతల దగ్గరగా కూచుని అమ్మ ముఖంలోకీ, బాబు మొఖంలోకీ అదే పనిగా చూస్తున్నాడు. లచ్చి ఏమవుతుందో!

'ఒరేయ్, నారిగా!' బయట నెవరో పిలుస్తున్నారు.

నారిగాడు మాత్రం ఈ ప్రపంచంలో లేడు.

'ఒరేయ్, నారిగా! ఏం చేస్తున్నావురా!' అంటూ పెంటిగాడు తడిక ఒత్తిగించి లోపలకు వచ్చాడు.

నారిగాడు వెఱ్ఱిగాచూశాడు, పెంటిగాడికేసి.

'మన దొరగోరు నిన్ను నుంచున్న పళాన్నిలా గెత్తుకు రమ్మన్నాడురా?

నారిగాడు యీ లోకంలో లేడు. ఏమీ విన పడ్డం లేదు.

'ఏరా, నిన్నేరా! అల్లా చూత్తావేంటిరా!'

'ఏంటిరా?'

'మన దొరగోరు నిన్ను నుంచున్న పలాన్నిల గెత్తుకురమన్నాడు.'

'ఎందుకు రమ్మన్నాడురా, అంత తొందర పనేంటి?'

'ఆరి దొడ్లో చింతచెట్టు విరిగి గొడ్లసాయిడి మీద పడింది దాంతో సాయిడి కూలిపోయి వంకర కొమ్ముల గెదె చచ్చింది. మిగతాయికడ ప్రాణంతో వున్నాయి. ఆటిని బైటికి లాగాలిప్పుడు నిన్ను లాక్కురమ్మన్నాడు.'

'ఇంత చలిగాల్లో యెట్టారా, మనమేమైనా బతకాలా? కూంతవాన యెలవనీ, పాకెత్తుదాం.'

'అమ్మ బాబో! ఇంకేమైనా వుందా? దొర చంపేడూ,. ఆలీసంచేత్తే? మనమూలన చచ్చెయని రేపు గింజల్లో తెగ్గోత్తాడు. కాస్త తడుత్తే తడుత్తాం, రద్దూ?

ఆలోచించాడు. నిజమే, యీవేళ వెళ్ళక పోతే, రేపు కూటిలోకి ఒక్క గింజకూడా వుండదు. ఏం చేస్తాడు? లచ్చినిచూస్తే అనుమానంగా వుంది. వొదల బుద్ధిపుట్టడం లేదు. అయినా తప్పదు, వెళ్ళి తీరాలి, దొర ఆజ్ఞ!

తడికవొత్తిగించి బయటకు వచ్చారు. ముందు పెంటిగాడు, వెనకాతల నారిగాడూ అడుగేశారు.

పిట్టేదో కూసింది—తీతువే కాబోల్ను! సందేహించాడు. అడుగుపళ్లేదు. మళ్ళీ వెనక్కు వచ్చాడు. రామిగాణ్ణి పిలిచి అన్నాడు: 'ఒరేయ్! పాప నెత్తుకుని అమ్మకాడ కూకో, యిప్పుడే వత్తాను.'

లచ్చి ముఖంవైపు ఒక్కక్షణం అదేపనిగా చూచేడు. దగ్గఱకువెళ్ళి ఒక్కసారి ఒళ్ళునిమిరాడు. చలిగాలికి కప్పడానికి చింకిగుడ్డయినా లేదుకదా! నెత్తిమీద చిరుగులపాగా తీసి ముఖంమీదకంటా కప్పాడు.

'ఏంటిరా, ఆలీసం? ఆఖరికి రేపు పొయ్యిలోకి గింజలుండవు, ఇట్టా ఆలీసం చేత్తేను' అన్నాడు విసుగుతో, పెంటడు గుమ్మంలో నుంచుని.

'మళ్ళీ యిప్పుడే వత్తాను' అని చెప్పి బయలుదేరాడు, దొరయింటికి.

గుమ్మందాటేదాకా నారిగాడివేపే చూస్తోంది లచ్చి. కళ్ళమ్మట రెండేరెండు బొట్లు జారాయి. ఏడవడానికికూడా ఓపికలేదు.

గుమ్మంలో అడుగెట్టేటప్పటికి ఉగ్రుడై నుంచున్నాడు దొర. హడలిపోయాడు, నారిగాడు.

'ఏరా, గాడిదకొడుకా, యింత ఆలస్యంగా చచ్చావేం? నీ మూలాన్ని మళ్ళీ ఆ యెఱ్ఱగేదెకూడా చచ్చింది. ఉండు నీ గింజల్లో తెగ్గోస్తాను. అల్లా అయితేనేకాని, నీ పొగురణగదు.'

'అదికాదు బాబయ్యా, మా ఇంటిది జ్వరంతో తొంగుంది, రెండురోజులబట్టీని. తింటానికి గింజల్లేవు. రామిగాణ్ణి చూస్తుండమని చెప్పి వచ్చేప్పటికి ఆలీసం అయిందండి. గింజలు తెగ్గోత్తామంటే యెట్టాబాబూ, దొరగోరు మన్నించాలి.'

'కబుర్లు బాగా నేర్చావులే, నీ తెగులు అల్లా అయితేనే కాని కుదరదు. తొరగా దొడ్లోకెడ్చి ఆ పాక యెత్తండి యిద్దఱూను.'

పెంటడూ, నారిగాడూ దొడ్లోకి పోయారు. సర్వవిధాలా పాక నెత్తడానికి ప్రయత్నిస్తున్నారు. ఇద్దఱు మనుష్యుల కంత పెద్ద పాక నెత్తడానికి తరమవుతుందా? అయినా, కాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. లాభం కావడంలేదు. వెనకాల దొర 'హూ' తిట్టిపోస్తున్నాడు, ఆలస్యం అవుతోందని. ఇంతలోకే కొనప్రాణంతోవున్న గేదెమూడ ఓదీర్ఘం తీసింది. దాంతో దొరకోపానికి అంతులేదు.

'కుక్కల కొడకా! ఆలస్యంగావచ్చి, పాక యెత్తలేక, రెండుదూడలనూ నాశనంచేశావు. నీకు గింజలుకావాలేం?' నారిగాడితల దొర కఱ్ఱదెబ్బతో రెండయింది. ఒళ్ళంతా రక్తం కారుతోంది.

'ఎందుకు దొరా, అల్లా కొడతావ్? పాకెత్తడానిక్కి ఎంత తంటాలు పడుతున్నానో చూడ్డంలేదు, దొరా?'

ఇంతలోకే నారిగాణ్ణి పిలిచిన కేక వినిపించింది. రామిగాడు పరుగుపరుగున వస్తున్నాడు, తూలిపోతున్నాడు. తలమీదనుండి రక్తం వస్తోంది. కొడుకును చూసేటప్పటికి గుండెలెగిసిపోయాయి, నారిగాడికి.

'ఏరా బాబ్బా, యిల్లా లగెత్తుకొచ్చావు. తలంతా నెత్తురేంటిరా? అమ్మ యేం చేత్తోందిరా?'

'ఒరేబాబా, గుడిసె కూలిపోయింది. అమ్మ లేవబోయేతలికి గుడిసె నెత్తిమీదపడి తల పగిలింది. అల్లాగే మంచంమీద కూలిపోయిందిరా. నాకు బయమేసి లగెత్తపోయేసరికి గుమ్మం కూలి నెత్తికి దెబ్బ తగిలిందిరా?

నారిగాడు నిశ్చేష్టుడయ్యాడు. తల దిమ్మెక్కిపోయింది. నెత్తిమీద దెబ్బ, రక్తం, భార్య నెత్తిమీద దెబ్బ- రక్తం!!! ప్రపంచం అంతా రక్తం!!! శ్వేసస్తంభించిపోయింది. తుపాను అపారంగా రేగింది ప్రాణం పోతూన్నా ఒక్కటే ఆలోచన 'లచ్చిని చూడాలి'.

అంత బలహీనతలోనూ కుఱ్ఱాణ్ణి బుజాన్నేసుకున్నాడు, బయలుదేరాడు.

"ఓరేయ్, ఓరినారిగా! ఎక్కడకుపోతావ్! ముండా కొడకా, పాకత్తి మటీ వళ్లు చంపేస్తాను, తెలుసా?" అన్నాడు దొర.

అబ్బే, వినిపిస్తేగా పరుగుపుచ్చుకున్నాడు. తూలిపోతున్నాడు. తోవలో యిళ్లన్నీ గిర్రున తిరిగిపోతున్నాయి. ఇందాకటి పక్షి యింకా అతని నెత్తి మీద కూస్తూన్నట్టే వుంది. చెవులు గింగురు మంటున్నాయి. గుడిసె దగ్గఱకెళ్లాడు.

గుడిసెచుట్టూ నీరు నిలిచింది. దాటబోయాడు కాలు జారింది. కొడుకు సహితంగా క్రిందపడ్డాడు.

పక్షి ఒక్కసారి— తుదిసారి కాబోలు!— పెద్దగా అరిచి ఆగిపోయింది. ప్రకృతి పక్షి అరుపుకు ప్రతిధ్వనించింది. గాలి తుపాను మాత్రం అదేపనిగా వీస్తోంది, తనకేం నిమిత్తంలేనట్టు. ఎక్కడవో రెండు తాటాకులు యెగిరివచ్చి వాళ్లమీద పడ్డాయి.

## మూడు లెక్కలు

రాము ఉద్యోగం కోసం ఒక కంపెనీలోకి వెళ్లాడు. కంపెనీ మేనేజర్ "నీకు డబుల్ ఎన్ట్రీ అంటే ఏమిటో తెలుసా?" అని ప్రశ్నించాడు.

రాము:—"తెలియకేమండి! మొన్నటి వరకూ పనిచేసిన కంపెనీలో ట్రిబుల్ ఎన్ట్రీలు వ్రాసే వాణ్ణి,

మేనేజర్:—అదేమిటి?

రాము:—నిజంగా ఎంత లాభం వచ్చిందో మేనేజరుకి చెప్పడానికి ఒక లెఖ్ఖ, మరొకటి భాగస్థులకి లాభాలు లేనట్లు చూపించేది. మూడవది ఇన్కమ్టాక్సు వాళ్లకి నష్టాలు వచ్చినట్లు చూపించేది.

—యం. యస్. శర్మ, పల్లిపాలెం.


# CLOTHING GOODS

Of Every Description for the Season

Ranging from Babies Frocks to Ladies Dress—Latest Stock, Largest Choice and Most Moderate Prices

★ Buy Now To Your Advantage ★

**S. R. B. Kuppuswamy Iyer & Son,**

(*Formerly*: S. R. Baluswamy Iyer & Sons)

230, East Marret Street : : MADURA &

83, Nyneappa Naick Street : : P. T. MADRAS.